## క్లుప్తంగా

### ఉచిత వైద్యశిబిరం




వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసీదాస్

**ఇల్లందకుంట:** ఇల్లందకుంట పీహెచ్‌సీ పరిధి వాగొడ్డురామన్నపల్లి గ్రామమంలో డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 30 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిల్వ నీటితో దోమలు వృద్ధి

**చిగురుమామిడి:** మండలంలోని నవాబుపేట్ గ్రామంలో ఇళ్ల మధ్య వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామంలోని రెండో వార్డు బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలు లేక మురుగు, వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదు దీంతో దుర్వాసన వస్తోందని, రాత్రి వేళ పాములు, కీటకాలతో ప్రమాదం పొంచిఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దోమల వల్ల జ్వరాల బారిన పడుతున్నామని, గతంలో మురుగుకాల్వలు నిర్మించాలని జీపీ పాలకవర్గానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని కాశవేని రాజయ్య, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి కొంరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ, మండల ప్రత్యేకాధికారులు తక్షణం స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### హౌజింగ్ బోర్డు కాలనీలో వరదకాలువ నిర్మాణానికి కృషి



డ్రైనేజీని పరిశీలిస్తున్న ప్రణవ్, నాయకులు

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీలో వరదకాలువ నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం హౌజింగ్‌బోర్డు, పిట్టలవాడ, అంబేడ్కర్ కాలనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏరియా, 16వ వార్డు, మోత్కులగూడెం కాలనీలో వర్షాలకు నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. ఏటా వరద ముంపునకు గురవుతున్నామని ప్రజలు సమస్య విన్నవించగా గత ప్రభుత్వం వరద కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చి పనులు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పార్టీ కార్యకర్తలు బాధితులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వెంట నాయకులు దేశిని కోటి, దిడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

### ట్రై సైకిల్ అందజేత



ట్రై సైకిల్ అందిస్తున్న బీజేపీ నాయకులు

**రామడుగు:** మండల కేంద్రానికి చెందిన జిట్టవేని ఆంజనేయులుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ట్రై సైకిల్ సమకూర్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుడు ఆంజనేయులు సంజయ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### అధికారుల నిర్లక్ష్యంతోనే ఎక్స్‌ప్రెస్ రైలు స్టాప్ రద్దు

**జమ్మికుంట:** అధికారుల అసమర్థత, నిర్లక్ష్యంతోనే పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సౌత్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల రద్దయిందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మంగళవారం ప్రకటనలో ఆరోపించారు. ప్రతిరోజు రాత్రి జమ్మికుంటకు రైలు చేరుకునే సమయంలో రైల్వే ఉద్యోగులు ఎవరూ ఉండడం సాధ్యం కాక టికెట్ ఇవ్వకుండా కొన్ని రోజులుగా బంద్ చేయడంతో రైల్వే అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి రైలు రద్దుకు కారణం అయ్యారని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విషయం తెలిపామని, స్టాప్‌ను పునరుద్ధరించాలని అధికారులకు లేఖ అందించామన్నారు.

### పిడుగుపాటుకు ఆవు మృతి

**జమ్మికుంట:** మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము రమేశ్ పాడి ఆవు పిడుగుపాటుతో మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాలు.. హర్యానా జాతికి చెందిన ఆవు మంగళవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గురైందని, రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని, జీవనాధారం కోల్పోయానని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొన్నాడు.



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



పాఠశాల వరండాలో భోజనం చేస్తున్న విద్యార్థులు



నిలిచిపోయిన డైనింగ్ హాల్ పనులు

## తరగతి గదులు, వరండాల్లో భోజనం

**శంకరపట్నం:** మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరగతి గదులు, వరండాలోనే మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. మనఊరు మనబడి పథకంలో డైనింగ్ హాల్ నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.13 లక్షల నిధులు మంజూరు చేసింది. గోడలు, పైకప్పు వేసిన కాంట్రాక్టర్ 2023 ఏప్రిల్‌లో పనులు నిలిపివేశాడు. నిధులు లేకపోవడంతో ఫ్లోరింగ్, విద్యుత్ పనులు ఆగిపోయాయి. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మనఊరు మనబడి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట నిధులు మంజూరు చేయనుంది. పాఠశాలలో 112 మంది విద్యార్థులున్నారు. సగంరేకుల షెడ్డుపై కవర్ కప్పి మధ్యాహ్న భోజనం నిర్వాహకులు వంట చేస్తున్నారు. విద్యార్థులు ప్లేట్లలో భోజనం పట్టుకొని తరగతి గదులు, వరండాల్లో భోజనం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ తిరుపతిని వివరణ కోరగా మనఊరు మనబడి కింద డైనింగ్‌హాల్ మంజూరైంది. పనులు చేసినంత వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు అందించాం. మిగతా పనులు చేసేందుకు అమ్మ ఆదర్శపాఠశాల కింద నిధులు మంజూరు కావాల్సి ఉంది. నేను ప్రస్తుతం బదిలీ అయ్యాను మరిన్ని వివరాలకు కొత్తగా వచ్చిన ఏఈని సంప్రదించాలి.

## యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర:** భారీ వర్షాలకు మండలంలో ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్ సమీపంలో గండిపడిన రోడ్డుతో పాటు లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో దెబ్బతిన్న బ్రిడ్జీలను మంగళవారం స్థానిక నాయకులు, అధికారులతో పరిశీలించారు. ప్రయాణాలకు అంతరాయం కలగకుండా చూడాలని, శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు ఖరారైన పనులెందుకు ప్రారంభించడం లేదని సమస్యలుంటే వెంటనే పరిష్కరించి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

**రామడుగు:** మండలంలోని గుండి గ్రామంలో మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటించారు. గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఊర చెరువు నుంచి వర్షపు నీరు ఊరు మధ్య నుంచి వెళ్లుతుండడంతో సమస్యలు వస్తున్నాయని, ప్రధాన రహదారిపై బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరారు. వెంట ఎంపీడీవో రాజేశ్వరీ, మాజీ ఎంపీపీ జవ్వాజీ హరీష్, వీర్ల నర్సింగరావు, మాజీ ఎంపీటీసీలు గుండి ప్రవీణ్, శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.



గుండి గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## పాతర్లపల్లి చెక్‌డ్యామ్‌కు గండి



చెక్‌డ్యామ్ నుంచి వృథాగా పోతున్న నీరు



బురదమయంగా మొలంగూర్ జెడ్పీహెచ్ఎస్

**ఇల్లందకుంట/శంకరపట్నం:** ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, చెరువులు,కుంటలు పొంగిపొర్లుతున్నాయి. ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌కు గండి పడింది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. మరోవైపు పంటలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. శంకరపట్నం మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరణ బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు స్కూల్ మైదానంలోకి నీరు చేరింది. మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు బురదలో నుంచి తరగతి గదుల్లోకి వెళ్లలేకపోయారు. అదనపు గదుల తాళం తీయకుండానే బురద లేని క్లాస్ రూముల్లో విద్యార్థులను పాఠాలు బోధించారు.

## కేజీబీవీని సందర్శించిన తహసీల్దార్

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ భాస్కర్ మంగళవారం సందర్శించారు. విద్యార్థినులకు జ్వరాలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీంతో వైద్యాధికారి శ్రావణ్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని విద్యార్థులను విడిగా ప్రశ్నించారు. రుచిగా లేవంటే కోపడుతున్నారని అధికారులకు విన్నవించారు. పాఠశాలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ఖాళీల వివరాలను స్పెషల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కర్

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**జమ్మికుంట:** పట్టణంలోని ఎంఎల్ఎస్ వేర్ హౌజ్ గోదాంను తహసీల్దార్ రమేష్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాంలో నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్ టెక్నికల్ అసిస్టెంట్ సాయి, ఇన్‌చార్జి మూర్తి, ప్రిన్సిపల్ లచ్చయ్య సిబ్బంది పాల్గొన్నారు.

### రైతుల వివరాలు నమోదు

**చిగురుమామిడి:** మండలంలోని బొమ్మనపల్లి, రేకొండ గ్రామాల్లో రుణమాఫీకాని రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేసినట్లు ఏఓ రాజులునాయుడు తెలిపారు. మంగళవారం రేకొండ గ్రామంలో మాట్లాడారు. రెండు గ్రామాల్లో దాదాపు 150 మంది రైతుల కుటుంబాల వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశామని, రైతు వేదికల్లో సభలు నిర్వహిస్తూ రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సతీష్, సాయి, అఖిల, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

### ఐదో రోజుకు రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు రామస్వామి

**జమ్మికుంట:** పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం పక్కన సర్వే నంబర్ 467లోని ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, పెసరుబండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త గుర్రం మహేంద్రనాథ్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ఎండీ అక్బర్ పాషా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజుకు చేరింది. మంగళవారం కాంగ్రెస్ నాయకుడు వాసాల రామస్వామి, తదితరులు మద్దతు తెలిపారు.

### సీఐ, తహసీల్దార్‌కు సన్మానం

**హుజూరాబాద్:** పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ మంచిపేరు పొందారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం సీఐ తిరుమల్‌గౌడ్, తహసీల్దార్ కనకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు ముక్క రమేశ్, పాల కిషన్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఇమ్రాన్, నాయకులు సదానందం పాల్గొన్నారు.



సీఐ తిరుమల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్,రమేశ్, కిషన్, ఇమ్రాన్

### గురుకుల కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**జమ్మికుంట:** పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ లచ్చయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. బైపీసీ, ఎంపీసీలో అన్ని కేటగిరీల సీట్లు ఖాళీలగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు 5వ తేదీన సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 7995010584, 9440347270, 8374763603 నంబర్లు సంప్రదించాలని పేర్కొన్నారు.

### 10 జీపీఏ సాధిస్తే ప్రోత్సాహకం



శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

**శంకరపట్నం:** పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.ఐదువేల ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని ఎంపీడీవో కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. వర్షం నీరు ఇంకేలా పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్లకు నీటిసౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాష్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, రమేశ్, కార్యదర్శి నర్సయ్య, టీచర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**జమ్మికుంట:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎల్ఐసీ అరవై ఎనిమిదేళ్ల వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జమ్మికుంటశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టగా పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ, కాకతీయ హైస్కూల్ ద్వితీయ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, జమ్మికుంట ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్లు రాజేందర్, ఇమాన్యుయల్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మర్రి అవినాశ్, రవికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ప్రీ స్కూల్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

**చొప్పదండి:** పోషణ మాసం పురస్కరించుకొని పట్టణంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు ప్రీ స్కూల్‌పై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ కోమల, తదితరులు పాల్గొన్నారు.

### భూ పరిహారం అందించాలి



మాట్లాడుతున్న కడారి వీరయ్య, మొగిలి కనకయ్య

**రామడుగు:** రామడుగు సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జితో భూమి కోల్పోయామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని బాధిత రైతులు కడారి వీరయ్య, మొగిలి కనకయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పరిహారం కోసం గత ప్రభుత్వాన్ని ఐదేళ్లుగా కోరిన లాభం లేకుండా పోయిందని వాపోయారు. ఇటీవల వర్షాలకు పాత బ్రిడ్జి కొట్టుకుపోతుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మమ్మల్ని పిలిపించి వారం రోజుల్లో పరిహారం అందేలా చేస్తానని చెప్పారని తెలిపారు. అయినా ఇప్పటికీ పరిహారం రాలేదని ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు.



**హుజూరాబాద్‌రూరల్:** పట్టణ శివారులోని చిలుకవాగుపై బ్రిడ్జి లేకపోవడంతో పెద్దపాపయ్యపల్లి, కనుకులగిద్దె, రాంపూర్ గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు నిండుగా ప్రవహిస్తోంది. ప్రజలు అత్యంత ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు. మరోవైపు వాగు అవతలి వైపు శ్మశాన వాటిక ఉండటంతో మృతదేహాన్ని తీసుకెళ్లడానికి మరో దారి గుండా ఆరుకిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. సమస్యను వెంటనే పరిష్కరించాలని పట్టణానికి చెందినవారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్, సెల్ నం : 7032651516

**వాట్సప్ చేయండి..**
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.
మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

## పరిసరాల శుభ్రతపై అవగాహన

**జమ్మికుంట:** పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత, శుక్ర, మంగళవారం డ్రై డే నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడిపొడి చెత్త వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. బ్యాంక్ రుణాలతో ఆర్థికంగా ఎదగాలన్నారురు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, సీఎల్ఆర్పీ జ్యోతి, మంజుల, ఆర్పీలు దేవేంద్ర, సునీత, రజిత, అబేదబాను, మల్లేశ్వరి పలువురు పాల్గొన్నారు.

### ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న పీఈటీలు

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారంతో ముగిసినట్లు క్రీడా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీల్లో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, రామానందతీర్థ, రవికుమార్, మోహన్, తిరుపతి ఉన్నారు.

- **కాలువలను కాపాడాలి**

**హుజూరాబాద్:** పట్టణ శివారులోని మోడల్ చెరువు తూము కాలువలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. చెరువు రెండు తూముల నుంచి వరదనీటిని గుండ్ల చెరువుకు తరలించేవారు. కాలక్రమేణ ఒక తూము నుంచి నీరు బయటకు వస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి చెరువు భూములు ఆక్రమణకు గురికాకుండా నీరు సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలన్నారు.

- **ఆయన కళ్లు సజీవం**

**జమ్మికుంట:** పట్టణంలోని పద్మశాలీ వాడకు చెందిన దిడ్డి కృష్ణ (52) సోమవారం మృతి చెందారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి, వెంకటేశ్వర్లు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకారంతో వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో కృష్ణ నేత్రాలు సేకరించారు. మృతుడి భార్య వసంత, కూతురు సంధ్య, సహకరించిన క్యాతం రవి, దిడ్డి సుధాకర్, చరణ్‌కు ఫౌండేషన్ నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు.

- **బీసీ కులగణన చేపట్టాలి**

**సైదాపూర్:** బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు బీసీ కులగణన చేపడతామన్న ప్రభుత్వ నిర్ణయం స్వాగతించదగినదని, ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు మండల సోమారపు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు.

- **పెరటి కోళ్ల పంపిణీ**

**సైదాపూర్:** మండలంలోని సెర్ప్ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా డీపీఎం రవీందర్, ఏపీఎం కుమారస్వామి సంఘాల సభ్యులకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. స్వశక్తి సంఘాల్లోని మహిళలకు అవసరాన్ని బట్టి కోళ్లు పంపిణీ చేయనున్నామని డీపీఎం రవీందర్ తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీసీలు దేవేందర్, రమేశ్, పర్శరాములు, శ్రీనివాస్, రంజిత్, జమున, రాజేశ్వరి, సీవో కిషోర్, ఎంఎస్‌ఏ గీతారాణి, వీవోఏలు సరిత, వాణిశ్రీ, శారద, రజిత, వనజ, రేణుశ్రీ ఉన్నారు.

### అప్పుడు నాటారు... ఇప్పుడు నరికారు



**గంగాధర:** మండలంలోని కురిక్యాల శివారు నుంచి మధురానగర్ చౌరస్తా మధ్య రోడ్డు పక్కన విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను విద్యుత్‌శాఖ సిబ్బంది మంగళవారం నరికేశారు. హరితహారం పథకంలో మొక్కలు నాటి పశువులు మేయకుండా ట్రీగార్డులు ఏర్పాటు చేసి వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి మొక్కలను పెద్ద చేశారు. వృక్షాలుగా మారుతున్న క్రమంలో కరెంట్ తీగలకు తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని చెట్లను నరికేయడం పరిపాటిగా మారింది. ముందుచూపు లేకుండా అప్పుడు విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడమెందుకు వృక్షాలుగా ఎదుగుతున్న క్రమంలో నరకడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.